# బహుమతి

'రజని'

పచ్చని మామిడి తోరణాలతో తీర్చిదిద్దిన రంగ వల్లులతో కళకళలాడుతోంది పెళ్ళి పందిరి. ఏవో ఊపిరి సలపనన్ని బాధ్యతలు నెత్తిన వేసుకున్నట్టు ఎవరికి వారే హడావిడిగా తిరుగుతున్నారు.

నలుగురు తల నెరిసిన పెద్దలు కుర్చీలు వేసుకుని వక్కపొడి నములుతూ హాయిగా కబుర్లాడుకుంటున్నారు.

గరగరలాడుతున్న పట్టు చీరలు, రెపరెపలాడే సిల్కు లాల్చీలు కేరింతలు కొడుతూ ఎగిరే పుత్రకారు.

అలా కొద్ది క్షణాలు తను వచ్చినట్టు ఎవరికి చెప్పాలో అర్థం కానట్టు నిలబడిపోయాడు శంకరం. ఆ వాతావరణం ఉక్కిరిబిక్కిరి చేసేస్తోంటే జేబురుమాలుతో ఒకసారి ముఖం తుడుచుకున్నాడు.

ఎటునుండో వడగళ్ళలా మాటలు విన వచ్చేయి. "నయం. నీలాంటి వాళ్ళందర్ని నమ్ముకున్నాను కాను, నిలువునా గంగలో ముంచేవాడివి. ఎంత పెద్ద మనిషివి! ఏదో సామెత చెప్పినట్టు పదహారు రోజుల పండుగ అయ్యాకా వచ్చేవు కాదులే."

బాబాయి మాటల ధోరణి అలవాటే కనక నవ్వుకున్నాడు శంకరం.

"ఏమైనా ఇంకా ముహూర్తం టైము దాటి పోలేదుగా బాబాయ్! నువ్వు కోప్పడతావనే మా మేనేజరు శలవు ఇవ్వనంటే ఉద్యోగమున్నా మళ్ళీ దొరుకుతుంది కానీ మా లలిత పెళ్ళి మళ్ళా నా కోసం చెయ్యరు స్వామీ అని చెప్పి వస్తే" అన్నాడు గడుసుగా తప్పించుకుని.

ఓసారి నివ్వెరపోయి చూసి బాబాయి మనసు నిండా నవ్వాడు ఆనందంగా.

"ఒరేయ్! నువ్వు రాకుండా అదసలు పెళ్లి పీటలమీదికి అడుగు పెడుతుందా! నాల్రోజులు ముందుగా వచ్చి పెళ్ళి పనులన్నీ చక్కదిద్దుతావని ఆశపడ్డాను. పోనీలే."

శంకరం పిన్ని వచ్చింది.

"ఏం నాయనా! ఆలస్యంగా అయితేనేం ముత్తానికి రాగలిగేవు. కానీ అమ్మాయేది. ఇలాంటి ముచ్చట్లకి ఆడవాళ్లే ఎక్కువ సరదా పడతారని తెలియదా." అని ఆవిడ సన్నగా చీవాట్లు పెడుతోంటే.

"ఏం చెప్పేది పిన్నీ మీ అమ్మాయికి లేస్తే చెయ్యి నొప్పి, కూర్చుంటే కాళ్ళు లాగడమాయె. ఇక్కడికి రావాలంటే కనీసం వంద మైళ్ళు ప్రయాణం చెయ్యాలా! ఎక్కడ పడక వేస్తుందోనని తీసుకురాలేదు" అంటూ సంజాయిషీ చెప్పుకున్నాడు.

"ఇంతకీ పెళ్ళి కూతురెక్కడ. సిగ్గుల గదిలో కూర్చుందా! లేక ఓరచూపులు ప్రాక్టీస్ చేస్తోందా, బావగారిమీద వలలు విసరడానికి."

కొంటెగా లలిత ఉన్న గదిలోకి అడుగు పెట్టబోతూ విద్యుద్ఘాతం తగిలినట్టు ఆగి పోయాడు.

★ 'అమ్మా' అన్న పిలుపు అద్భుతానందాన్నిస్తుంది ఆడదానికి. ఆ పిలుపుకోసం, ఆ పిలుపులోని మాధుర్యంకోసం, బిడ్డల కోసం తపించిపోతుంది స్త్రీ. సంతానాన్ని మించిన బహుమతి లేదు మహిళకి! ★

కొంతసేపటివరకూ ఈ లోకంలోకి రావడానికి అతని మనసు నిరాకరించింది. తెలివి వచ్చాకా తన గుండెలు దడదడ కొట్టుకుంటున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది.

తన కళ్ళు చూస్తున్నది నిజమైనమనిషినా కలలోని రూపాన్నా. ఇవి ఇంత స్పష్టంగా స్వచ్ఛంగా చూడడం ఎప్పుడు నేర్చుకున్నాయి.

అతనికి మతిపోయింది.

మొగలిపూల జడ వేయించుకుంటున్న లలిత అడుగుతున్నవేమీ అతనికి వినిపించడం లేదు.

అతని దృష్టి మొగలిపూల జడమీద లేదు. అన్ని అలంకారాలతో మెరుపు తీవెలా శోభ లీనుతున్న లలితమీద లేదు. పెళ్ళి కూతురికి హారతులు పడుతూన్న అమ్మలక్కల మీద లేదు. వాళ్ళు ఆడుతూన్న ఛలోక్తులమీదలేదు.

అద్భుతంగా మొగలి రేకులతో తయారైన పువ్వుల్ని జడలో చక్కగా నేర్పరితనంతో అమర్చే తెల్లని సొగసైన ఆ చేతులవైపు.

చిన్నగా శబ్దం చేస్తున్న బంగారు గాజులతో చకచకా కదులుతున్న ఆ అందమైన చేతుల్ని

ఇంకొంచెం ధైర్యంచేసి

ఎర్రని పట్టు చీరకి మరింత అందాన్నిస్తున్న సృజనాత్మక సౌందర్యాన్ని ఆ మనోహర రూపాన్ని తదేకంగా చూశాడు.

ఆమె... మీనాక్షి. సందేహంలేదు. ఏవేవో ఆలోచనలతో క్షణక్షణం గుండె బరువుగా మారుతోంటే అతి బరువుగా నిట్టూర్పు విడిచాడు.

"ఎవరో గుర్తొచ్చిందా అన్నయ్యా! అప్పుడు శేషగిరి మావయ్య కూతుర్ని నీకిద్దామనుకున్నారే ఆవిడే ఈ మీనాక్షి వదిన. ఏమైనా బొంబాయిలో సెటిలయ్యాకా అందర్నీ మర్చిపోయావు. లేకపోతే వదిన్ని తీసుకురాకపోదువా! మీనాక్షి కూడా వాళ్ళాయన్ని దాచుకు వచ్చిందిలే ఎక్కడ మన మందరం పట్టి పీడిస్తామేమోనని."

లలిత ఆరిందాలా చెబుతోంది. అవును మరి పల్లెటూళ్లో పెరుగుతూన్న పిల్లాయె. అతిసహజంగా అన్ని తెలివి తేటలు అబ్బుతాయి.

"కాస్త మొహమెత్తి మా అన్నయ్యాని చూడనీయమ్మా! ఇంతలో అరిగిపోవులే. పెళ్ళి కూతుర్ని సిగ్గు నా వంతుగాని" వెనక్కి తిరిగి మీనాక్షి బుగ్గని మెల్లగా పొడిచింది.

లలిత మాటలకి కాబోలు మీనాక్షి కొద్దిగా కదిలి రెపరెపలాడే కళ్ళతో శంకరం వైపు ఒకసారి చూసి మళ్ళీ తలదించుకుని తనపనిలో లీనమై పోయింది.

చక్రాల్లాంటి కళ్ళు. మీనాక్షికి ఆ పేరు పెట్టిన వాళ్ళ మేధాసంపత్తిని తప్పక అభినందించాల్సిందే. విధి ఇంకోలా వక్రించకపోతే ఆ చక్కని కళ్ళు పసిమిఛాయలో మెరుస్తున్న ఈ బంగారమంతా తన స్వంతమై ఉండేది. అన్ని అధికారాలు తనవే అయ్యేవి. ఇప్పుడు దీనికి హక్కుదారు వేరొకరు. కనీసం తలచడానికన్నా తనకు అర్హతలేదు.

మీనాక్షి వంటి రంగుతో పోటీపడలేక మెడలో సుతారంగా ఊగుతోన్న పచ్చని మాంగల్యం చూడరానిచోట చూస్తున్నావని హెచ్చరించడంతోచటుక్కున దృష్టిమరల్చాడు.

"ఇంకా జ్ఞాపకం రావడంలేదా మీనాక్షి వదిన. అయితే మతిమరుపు వచ్చేసింది నీకు" లలిత నవ్వింది.

అసలు మీనాక్షిని ఎప్పుడన్నా మర్చిపోతే కదా గుర్తు తెచ్చుకోడానికి.


శంకరానికి ఆమెతో ఎన్నెన్నో మాట్లాడాలని ఉంది. పలకరించితే పెదవి విప్పుతుందో లేదో.

"బాగున్నావా మీనాక్షి" అన్నాడు అప్రయత్నంగా.

మీనాక్షి ముఖం దించుకునే తల ఊపింది. కానీ ఆమె చూపులు నేలవాలుగా తన పాదాలను తాకుతున్నట్టు గమనించిన శంకరం మనసు తెలియకుండానే స్పందించింది.

ఆ ముభావం ఆమె బిడియపడడం లేదనీ ఆమె హృదయం మెలి తిప్పిన బాధకి గురౌతోందనీ తెలియ చెబుతోంది.

గతమంతా కళ్ళముందు కదలాడుతోంటే చెమర్చిన కళ్ళను ఎవరూ చూడకుండా ఇవతలి



కొచ్చాడు.

మావయ్య హఠాత్తుగా పోవడంతో మీనాక్షి తల్లి కూతురి పెళ్ళికి తొందర పడి పోయింది. చిన్నప్పట్నుంచీ అనుకుంటున్న సంబంధం కనక శంకరం తండ్రికి కబురు చేసింది.

“వాడి చదువు పూర్తి అయ్యాకా చేస్తే బాగుంటుందేమో.ఇప్పుడు పెళ్ళికేం తొందర” అన్నాడు ఆయన. అప్పటికి శంకరం ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరంలోకి వచ్చాడు. ఈలోగా మీనాక్షికి వేరే సంబంధాలు చూస్తున్నట్టు వార్త అందింది. పెళ్ళి చదువుకి ఎక్కడ ఆటంకమవుతుందో నన్న తండ్రి భయానికి అతడు లోలోపలే చిరాకుపడ్డాడు. శేషగిరి మావయ్య ఇంటికి వెళ్ళినప్పుడు తనని చాటుగా చూసి పారిపోయే మీనాక్షి తలపుల్లో హత్తుకుపోయింది.

ఈ పెద్దవాళ్ళు ఒక్కొక్కసారి అసందర్భంగా ఆలోచిస్తారు.పెళ్ళికి చదువుకి సంబంధం ఏముంది నామొహం. మీనాక్షికి వేరే సంబంధం కుదిరిపోతే ఆ అందమంతా ఎవరి సొత్తో అయిపోదూ! తను ఆమెని ప్రేమించానని చెప్పుకోడానికి మొహమాటం అడ్డొచ్చింది. అందుకే మీనాక్షికి వేరే సంబంధం కుదిరిందని తండ్రి చెబుతోంటే మనసు విప్పలేని అసమర్థతకు తన్ను తాను తిట్టుకున్నాడు.

“ఆడపిల్ల గలవాళ్ళు కొంచెం అణకువగా వ్యవహరించవద్దూ నేనైనా కొన్నాళ్ళు ఆగమన్నాను కాని మీ పిల్లని చేసుకునేది లేదని ఏమీ చెప్పలేదే. ఆవిడ అంత పట్టుదలగా కూతురికి సంబంధం నిర్ణయిస్తే మనమెందుకు అడ్డుపెట్టాలి.” మీనాక్షి తల్లిపై కోపంతో తండ్రి ఏవేవో అంటుంటే మౌనంగా విన్నాడు. ఆమె పెళ్ళికి తమ ఇంటినుంచి ఎవరూపోలేదు.

మీనాక్షికి తన ప్రేమ గుర్తుగా ఏదైనా బహుమతి పంపుదామనుకున్నాడు. దానికి కూడా ధైర్యం చాలింది కాదు. చదువు పూర్తయి బొంబాయిలో ఉద్యోగం వచ్చాకా ఇందిర మెడలో తాళి కట్టడం ఇద్దరు బిడ్డల తండ్రి కావడం ఇవన్నీ నిన్నమొన్న జరిగినట్టుంది. అన్నట్టు మీనాక్షికి ఎందరు పిల్లలో.

ఆ పగలంతా ఆమె తనను తప్పించుకునే తిరగడంతో అతని మనసు చిన్నబోయింది.

సాయంత్రం చేలగట్ల వేపు వెళ్ళివచ్చాడు. పట్టణాలలో ఆ రణగొణ ధ్వనుల మధ్య విసుగ్గా కాలం గడిపే వారికి పక్షుల కిలకిలా రావాలు చెవినపడుతోంటే ప్రాణానికి ఎంత హాయిగా ఉంటుంది!

ప్రశాంతంగా ఉన్న ఆ వాతావరణంలో పూల సువాసనలను మోసుకొస్తూ తెరలు తెరలుగా వీస్తున్న గాలి మీనాక్షి తలపులతో రగులుతున్న అతని మదిని కొంచెం చల్లార్చింది.

రాత్రి పదిగంటలు దాటాకా ముహూర్త కాలం దగ్గరపడడంతో సందడి ఎక్కువైంది. బాబాయి వెనకే తిరుగుతూ శంకరం ఆయనకి అన్ని పనుల్లో సహాయపడ్డాడు. భోజనాల వద్దన దగ్గర్నుంచి మగపెళ్ళి వారికి మర్యాదలు చేయడం వరకు అన్నిచోట్ల తనే అయి కనిపించాడు.

అంత అల్లరిపిల్ల లలిత పెళ్ళి పందిట్లో బుద్ధిగా మొగుడిపక్కన కూర్చుని పురోహితుడు చెప్పిన ప్రకారం చేస్తోంది.

మంగళ సూత్రధారణ సమయంలో తెల్లని జరీ చీర తలనిండా మల్లెలతో లలిత పక్కన వంగుని మీనాక్షి ఆమె చెవిలో ఏదో చెబుతూ ముసిముసిగా నవ్వుతోంటే "పో! వదినా" లలిత సిగ్గు నభినయిస్తోంది.

పందిరి గుంజ నానుకుని నిలబడిన శంకరం మనసులో ఆ దృశ్యం ముద్రపడిపోయింది.

క్రితం రాత్రంతా నిద్రలేమి, ప్రయాణ బడలిక ఉదయం నుంచీ నెత్తిన వేసుకున్న పెళ్ళి పనులు అలసటతో కళ్ళుమూతలు పడుతున్నా బలవంతాన నిద్ర ఆపుకుంటూ పెళ్ళి తంతు తిలకిస్తున్నాడు.

"ఏరా! శంకరం నిలబడే నిద్రపోతున్నావు. నిన్నరాత్రి కూడా ప్రయాణంలో నిద్రలేదాయె ఎలాగా మాంగల్యధారణ అయిపోయింది. కనక కాస్సేపు నడుం వాల్చు. విడిదిల్లు ఖాళీగానే ఉంది" బాబాయి హెచ్చరికతో కొంచెం సేపు నిద్రతీస్తేనేగాని లాభం లేదనుకుని విడిదింటి వైపువచ్చాడు.

నిద్రపోతున్న ఒకరిద్దరు పిల్లలు తప్ప అందరూ పెళ్ళి పందిట్లోనే ఉన్నట్టున్నారు. చిందర వందరగా పడేసిన సామానుతో నిండిపోయిన గదులన్నీ దాటుకుంటూ పెరటివైపు వసారాలో మడత మంచం కనిపిస్తే దానిపై మేను వాల్చాడు.

పక్కనే వున్న పూలపందిరినుండి వస్తున్న విరజాజి పరిమళం మత్తులో ముంచెత్తుతోంది. సన్నగా వినిపిస్తూన్న మంగళవాయిద్యాల మధ్య చెట్టు కొమ్మలు చేసే సవ్వడికూడా కలుస్తోంది. అలసిపోయిన శరీరాన్ని వెంటనే నిద్రాదేవత రెండు చేతులూ చాపి తన కౌగిలిలోకి లాక్కుంది.


తనమీదికి ఒరిగిపోతోన్న ఓ పాలరాతి శిల్పం విశాలమైన కళ్ళు నున్నటి చెంపలు అదిరే ఎర్రని తడిముద్దలాంటి పెదిమలు.

ఆత్రంగా తను ఆ పెదవుల్ని పదేపదే ముద్దు పెట్టుకుంటూ మెత్తగా తాకుతున్న ఆ శిరోజాలను సవరిస్తున్నాడు.

ఆ పాలరాతి సౌందర్యం ఎవరు! ఇంకెవరు తను కోరుకున్న మీనాక్షి తన స్వంతమైన మధుర క్షణాలు. జీవితంలో తిరిగిరాని అమృత ఘడియలు.

గుండె వేగంగా స్పందిస్తూంటే తన చేతుల్ని ఆమె నడుంచుట్టూ పెనవేసి దగ్గరగా....

ఎవరో తట్టి లేపినట్టు హఠాత్తుగా మెలకువ వచ్చేసింది. తను ఎక్కడున్నాడు. మీనాక్షితో తను స్వప్న.....కాదు స్వర్గలోకాలలో విహరించేడు. కలే అయినా ఎంత బాగుంది! శాశ్వతంగా అలాగే నిద్రపోగలిగితే ఇంకేం కోరుకుంటాడు తాను.




ఇది కలకాదు నిజమే. తనని తాకుతోన్న మెత్తని స్పర్శ అతనికి అనుభవంలోకి వచ్చింది. శంకరం చటుక్కున లేచి కూర్చున్నాడు.

"నేనే బావా! బీరువా తాళాలు ఎక్కడ పెట్టావో అత్తయ్య వెతుక్కుంటోంది." అంది. ఆమె గొంతు సన్నగా స్వచ్ఛంగా వుంది.

"తాళాలకేం బాబాయి దగ్గిరే వున్నాయికానీ మీనాక్షీ" శంకరం కంఠంలో ఆవేదన ధ్వనించింది.

"నేనంటే నీకు అసహ్యం కదూ! అందుకనే నన్ను తప్పించుకు తిరుగుతున్నావు. అవునా!''

మీనాక్షి గలగలా నవ్వింది.

"భలేవాడివే. నలుగురిలో నీతో మాట్లాడితే ఏం బాగుంటుంది. చూసేవాళ్ళు వేరే విధాన అనుకోరా!"

శంకరం సర్దుకున్నాడు.

"అలాగా! ఇలా ఏకాంతంగా పలకరిస్తే తప్పులేదన్నమాట'' అతని మాటల్లో కొంటెదనానికి మీనాక్షి ముఖం ఎర్రబడింది.

"అలా అని ఎవరన్నారు" అంది మరింత రెచ్చగొడుతూ. వెచ్చగా సెగలు రేపుతున్న వెన్నెల, మల్లెల వాసన ఆమె సౌందర్యం అతనికి పరవశం కలిగిస్తోంది. రెచ్చగొట్టే ఆమె మాటల ధోరణి పిచ్చివాడిని చేస్తోంది.

"నువ్వు....నువ్వు ఎందుకింత బాగుంటావు" అన్నాడు అర్థరహితంగా-మళ్ళీ

"నేను చాలా దురదృష్టవంతుణ్ణి మీనాక్షి. నాన్నని ఎదిరించి ధైర్యంగా నిన్ను చేసుకోలేకపోయాను. కానీ ఇప్పటికీ నువ్వు నా ప్రేమ దేవతవే" అన్నాడు శంకరం ఆవేశంగా.

మీనాక్షి ఇంకొంచెం నవ్వింది.

"అవన్నీ ఇప్పుడెందుకు."

"నిజమే. నువ్వు ఇంకొకరి భార్యవి అయిపోయావు గనక నేనిలా మాట్లాడకూడదు. క్షమించు మీనాక్షి."

"పిచ్చివాడివి" ప్రేమగా అతని జుట్టు సవరించింది. "నే నెప్పటికీ నీదానినికాదా బావా."

"నిజంగానా! ఇందాకటి కలలో మీనాక్షి ఎంతో మంచిదనుకున్నాను. అసలు మీనాక్షి ఇంకా ఇంకా మంచిది" అతని మనసు క్షణక్షణానికీ అదుపు తప్పుతోంది.

తనని చుట్టుకున్న అతని చేతుల్ని ఆమె వారించలేదు. అతన్ని గాఢంగా హత్తుకుపోతూ చెవిలో మెల్లగా గొణిగింది.

"మనం ఇలాగే వుండిపోకూడదూ."

* * *

తెల్లవారాకా శంకరం ఎవరి ముఖం సరిగా చూడలేక పోయాడు. ఆ క్షణంలో ఎందుకంత అవివేకం తనని ఆవహించింది. మీనాక్షి ఏమను కుంటుంది. ఆమె ఊహల్లో తను ఎంత నీచు డుగా చిత్రించబడతాడు. వివాహిత అయిన స్త్రీని ఛ—

తిరిగి దిద్దుకోలేని పొరపాటుజరిగిపోయింది. ఆమె తొందరపడితే మాత్రం తన బుద్ధి ఏమ య్యింది.

వెంటనే ప్రయాణమయ్యాడు.కానీ శంకరం బాబాయి వెళ్ళనివ్వలేదు.

"ఇంకా రెండ్రోజులు సెలవుందిగా! వెడు దువుగానిలే. అవతల మీనాక్షి ప్రయాణం కట్టింది. స్టేషన్ వరకూ నేను సాయం వెళ్దొస్తా ననుకో...."

ఉలికిపాటును బయటపడనివ్వలేదు.

"మీనాక్షి వెళిపోతోందా." అని మాత్రం అన్నాడు.

కొత్తచీర కట్టుకుని కాళ్ళకి పసుపు పూసు కుని అందరికీ చెప్పి శంకరం దగ్గరికి వచ్చి ఆగింది మీనాక్షి.

"వస్తాను బావా" ఇదివరకులా ఆ కళ్ళలోకి సూటిగా చూడలేక అపరాధిలా తలదించు కున్నాడు.

"మంచిది మీనాక్షీ."

"నాగపూర్ వచ్చినప్పుడు మా ఇంటికి రా బావా! వస్తావుకదూ" మీనాక్షి కంఠంలో అభ్యర్థన, కాదు ఆజ్ఞ మిళితమైంది.

శంకరాన్ని ఒప్పించిగానీ బండెక్కలేదు మీనాక్షి. ఎడ్ల మువ్వల చప్పుడుతో బండి పరు గులు తీసింది.

నాగపూర్ ఆఫీసు పనిమీద వచ్చినప్పుడు గుర్తుంది శంకరానికి మీనాక్షి వాళ్ళు అక్కడే వుంటున్న సంగతి. మీనాక్షి భర్త ఎలా వుంటాడో! ఏదో అతీతశక్తి ఆమె ఇంటికి బయలుదేరదీసింది. బజారులో నడుస్తుంటే గుర్తొచ్చింది, తన ప్రేమ గుర్తుగా మీనాక్షికి ఏమైనా ఇవ్వాలనుకున్నట్టు.

వెంటనే ఆగి కనిపించిన షాపులో దంతంతో చేసిన రాధాకృష్ణుల విగ్రహం తీసుకున్నాడు. వారిలానే తమ మధ్యగల అనుబంధంకూడా గొప్పదనిపించింది.

ఇల్లు తొందరగానే దొరకడంతో తేలిగ్గా ఊపిరి పీల్చాడు. తననిచూసి ఏమంటుందో మీనాక్షి.

హాలులో తెల్లని సూటు ఒత్తైన గిరజాల జుట్టుతో హుందాగా కూర్చుని వున్న వ్యక్తిని చూసి

"మీనాక్షి భర్త అందమైనవాడే" శంకరం లోలోపల అసూయ పడకుండా వుండలేక పోయాడు.

సోఫా పక్కన మూడేళ్ళ పిల్లవాడు బొమ్మ లతో ఆడుకుంటున్నాడు. కర్టెను తొలగించుకు కాఫీ తీసుకువస్తున్న మీనాక్షి ముఖం శంకరాన్ని చూస్తూనే వికసించింది.

"రా. బావా! అక్కడే ఆగిపోయావేం. నువ్వెప్పుడూ ఈయన్ని చూడలేదు కదూ!.... మావారే" అంటూ పరిచయం చేసింది.

"నా పేరు చంద్రశేఖరం. అయితే మా మీనాక్షికి బావగారన్న మాట. ఆవిడ ఇంతగా ఆహ్వానిస్తున్నదంటే మీరు చాలా ఆత్మీయులు గానే లెక్క."

అతడు మామూలుగానే మాటలాడుతున్నా శంకరానికి వేరే అర్థం ధ్వనిస్తోంది.

"ఇంకా ఒక్కడేనా. అదృష్టవంతులు" అన్నాడు పసివాణ్ణి ఎత్తుకుంటూ.

చంద్రశేఖరం అదేదో హాస్యంగా జమకట్టి నవ్వాడు. "మీ మరదలు ఒప్పుకోదండీ. ఎక్కువ పిల్లలు పుడితే తన ఆరోగ్యం పాడైపోతుందిట. అలా అనే తల్లుల్ని మీ రెంతమందిని చూశారు చెప్పండి. మా అమ్మకి మేం పదిమంది సంతానమైనా ఎంత ఓపిగ్గా పెంచింది. ఇప్పటికాలం ఆడవాళ్ళ తీరే వేరు. ఏమంటారు."

శంకరం నవ్వి ఊరుకున్నాడు ముగ్గురు పుట్టినా ఆపరేషన్‌కి ఒప్పుకోని భార్యను తలచు కుని.

మీనాక్షి వంటింట్లో పని ముగించుకుని



## (వి) చిత్ర విజ్ఞానం

### గోల్ఫ్ బంతి రహస్యం

గోల్ఫ్ బంతి ఒకవిధమైన దళసరి ప్లాస్టిక్ పొరతో కప్పబడి వుంటుంది. ఈ పొరకింద కొన్ని కిలోమీటర్ల నిడివిగల దారంతో చుట్టబడిన వుండ వుంటుంది. ఈ వుండ లోపల గుండ్రటి రబ్బరు బంతి వుంటుంది. ఈ రబ్బరు బంతి లోపల ఉండే దేమిటో తెలుసా! ఆముదం!!

---

వాళ్ళ ఎదురుగా కూర్చుంది.

"నామీద ఏం నేరాలు చెప్పుకుంటున్నారు."

"ఈవిడకి మొండితనం ఎక్కువ శంకరం గారూ. తనకి ఎంత తోస్తే అంతే. మరొక ఆడ పిల్ల వుంటే ఇల్లు కళకళ లాడదూ."

అలని మాటల్ని మీనాక్షి తేలిగ్గా కొట్టి పారేసింది. "ఇంటిని పీకి పందిరి వేయడానికి ఒక్కడు చాలురెండి. అంతా కులాసానా బావా. మీ ఆవిడ ఆరోగ్యం ఎలా వుంది. లలిత పెళ్ళికి చూడ్డమే నిన్ను. అప్పుడే నాలుగేళ్ళ య్యింది" నిట్టూర్చింది.

మీనాక్షి మరీ బలవంతం చేయడంతో ఆ రోజుకి ఆగిపోక తప్పలేదు శంకరానికి. వచ్చే టప్పుడు

"మీ పెళ్ళికి రాలేకపోయాను మీనాక్షి. ఎప్పటినుంచో నీకిది ఇవ్వాలని నా కోరిక ఆల స్యంగా బహుకరిస్తున్నాను." రాధాకృష్ణుల విగ్రహం టేబిల్ మీద పెట్టాడు.

ఒకసారి ఆ బొమ్మవైపు చూసిన మీనాక్షి కళ్ళలో ఏవో నీలినీడలు కదలాడాయి. మరు క్షణం అవి ఎప్పటి కాంతిని నింపుకున్నాయి.

"పోనీ ఇప్పుడు మాత్రమేం. మా అబ్బాయి ఆడకుండుకు ఉపయోగపడదా" ఆమె వారి స్తున్నా వినకుండా ఓ పచ్చ కాగితం పిల్లవాడి చేతిలోపెట్టి బయలుదేరాడు. చంద్రశేఖరం గేటువరకూ వచ్చి సాగనంపాడు.

అడుగు ముందుకు వెయ్యబోతోంటే.

"కర్చీఫ్. మర్చిపోయావు బావా" అంటూ వచ్చింది మీనాక్షి.

"నాది కాదే" అనబోయి ఆగిపోయాడు శంకరం. ఆమె చూపులలోనే సౌంజ్ఞచేస్తోంటే నీలిరంగు రుమాలుని భద్రంగా జేబులో పెట్టు కున్నాడు.

"ఈ ఊరు వచ్చినప్పుడు మమ్మల్ని మరచి పోకండీ" అన్నాడు చంద్రశేఖరం.

"మరచిపోను" అన్నాడు చిరునవ్వుతో. చంద్రశేఖరం మంచి సంస్కారవంతుడు. అత నితో వైవాహిక జీవితం మీనాక్షిని పూలతేరుపై నడిపిస్తుందనటంలో సందేహంలేదు.

కానీ మీనాక్షి తనతో చెప్పదలచుకున్నదేదో వున్నట్టుంది. ఆ కళ్ళల్లో మూగవేదన ఎందుకు ప్రతిఫలిస్తోంది.

హఠాత్తుగా నీలిరంగు జేబురుమాలు గుర్తు కొచ్చి తీసిచూశాడు. అతనూహించినట్టే అందు లోంచి ఓ కవరు క్రిందపడింది.

ఆత్రుతగా తీసి చదివాడు.

బావా!

నీతో చాలా చెప్పాలని వుంది. కానీ ఉత్తరం ద్వారా తప్ప అది సాధ్యంకాదని తెలుసు. అందుకే ఇది వ్రాస్తున్నాను. లలిత పెళ్ళిలో ఆ నాటి నా ప్రవర్తనకి నువ్వు ఎన్ని అర్థాలు చెప్పుకున్నావో మీనాక్షిని ఎంత హీనంగా చిత్రించుకున్నావో నా అంతరాత్మ క్షోభించని క్షణంలేదు.

నీ భార్యను కావలసినదాన్ని విధివ్రాతవల్ల తప్పిపోయింది. కానీ నామీద అభిమానం నీలో చెక్కుచెదరకుండా వుందని గ్రహించేను. అందుకే... అందుకే ఆరాత్రి సాహసించేను. ఏ ఆడదీ చేయకూడని పాపం చేశాను. ఏ భార్యా తలపెట్టని ద్రోహంతో నేను నా భర్తని వంచించేను.

ఎందుకు తెలుసా. నాలుగేళ్ళ క్రితం లలిత పెళ్ళి ఇంకా అవలేదు అప్పటికి. మావారికి స్కూటర్ మీద వస్తుంటే యాక్సిడెంట్ అయింది. ఆ ఆక్సిడెంట్‌లో మావారు పోగొట్టుకున్నదేమిటో డాక్టరు చెప్పాకా నాకు పిచ్చెత్తినట్టే అయింది. అంటే ఈ జన్మలో నేను సంతానవతిని కాలేనన్నమాట. అక్కడికి హాలాహలం లాంటి ఆ నిజాన్ని భరించడానికి సిద్ధపడ్డాను. అయినా దేవుడు ఇంకా పరీక్షలకు గురిచేశాడు.

"ఈ సంగతి ఆయనకి తెలియడానికి వీల్లేదు. హార్టు ఫెయిలయ్యే ప్రమాదం వుంది. ఏమంటే కొద్దిగా షాక్ ఇచ్చే వార్తలు విన్నాకూడా ఆయన గుండె తట్టుకోలేకపోవచ్చు" అని చెప్పాడు డాక్టరు.

ఏం చేయాలి. హృదయంలో అగ్ని ప్రజ్వరిల్లుతున్నా పైకి చిరునవ్వు నటించేదెట్లా! మొండిదాన్ని కనక అలవాటు పడిపోయాను అనుకో. కానీ ఆయన మనసులో దినదిన ప్రవర్ధమానమయే అనుమానం ఎలా తీర్చడం "పిల్లలు కావాలనుకోవా మీనాక్షీ. ఏందుకైనా మంచిది డాక్టర్‌ని కన్సల్టు చేస్తాను." అన్నప్పుడు నిలువునా కృంగిపోయాను.

"ఇప్పుడేమంత అవసరం వచ్చిందండీ. పిల్లలు లేకపోతే పోయె. ఒకవేళ నాలోనే ఏదైనా లోపం వుందేమో." ఎంత ప్రయత్నించినా ఆయన్ని ఒప్పించలేకపోయాను. అదే సమయంలో లలిత పెళ్ళికి రావడం తటస్థించింది. ఆ తర్వాత నా ప్రవర్తనకు ఈ కథ అన్వయించుకోగలవు కదూ.

నన్ను ఎలాగూ అసహ్యించుకుంటావు. నాకు తెలుసుగానీ నేనేం చేసినా మాతృత్వం కోసం కాదు. నా భర్త ప్రాణాలు నిలబెట్టుకోడానికే చేసేనని నమ్ముతావా బావా.

నువ్వు నాకిచ్చిన బహుమతి రాధాకృష్ణుల విగ్రహం కాదు. అంతకంటే విలువైన నా ముద్దుల సతీష్‌ని. మా ఇంట్లో నవ్వుల పంటలు వెదజల్లే బంగారు కొండని.

మరి నీకు కృతజ్ఞతలు ఎలా చెప్పుకోనూ

—నీ మీనాక్షి! □

మీరు చదివారా!

ప్రమోద

పిల్లల మాసపత్రిక

వెల : రూ. 1-25

సం. చందా రూ. 15/-